ఉత్సాహంగా లిటిల్‌ఫ్లవర్ స్కూల్ వార్షికోత్సవం

అబిడ్స్: విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా అన్నిరంగాల్లో తీర్చిదిద్దాలని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. అబిడ్స్‌లోని లిటిల్‌ఫ్లవర్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులను చిన్నప్పటి నుంచే సామాజిక, సాంఘిక, క్రీడా, సాంస్కృతిక రంగాల్లో రాణించే విధంగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. లిటిల్‌ఫ్లవర్ పాఠశాల ఎన్నో సంవత్సరాలుగా తమ విద్యార్థులు ప్రపంచంలోని అన్ని దేశాల్లో కీలక రంగాల్లో రాణించే విధంగా తీర్చిదిద్దిందన్నారు. దేశంలోనే కాక విదేశాల్లో కూడా లిటిల్‌ఫ్లవర్ పాఠశాల విద్యార్థులు నేడు దేశ కీర్తిని, పాఠశాల కీర్తిని ప్రతిష్ఠతను చాటుతున్నారన్నారు.

విద్యారంగవ్యాప్తికి కృషి..

లిటిల్‌ఫ్లవర్ పాఠశాల విద్యారంగ వ్యాప్తికి ఎంతో కృషి చేస్తుందని సినీనటు సుమన్ పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న సుమన్ పలువురు విద్యార్థులకు మెమొంటోలను అందజేసి సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ..విద్యార్థి దశ ప్రతిఒక్కరికి ఎంతో కీలకమన్నారు. విద్యార్థి దశలోనే విద్యార్థుల భవిష్యత్తు పొంది ఉంటుందన్నారు. విద్యార్థులను ప్రతి రంగంలో రాణించే విధంగా లిటిల్‌ఫ్లవర్ పాఠశాల యాజ మాన్యం చేస్తున్న కృషి అమోఘమని కొనియాడారు. వేలాది మంది


వేడుకల్లో నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, సినీ హీరో సుమన్, ప్రిన్సిపల్ బ్రదర్ షాజాన్ ఆంథోని

విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దిన ఘనత లిటిల్‌ఫ్లవర్‌కే దక్కిందన్నారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతాం..

విద్యార్థులను అన్నిరంగాల్లో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది వారి భవిష్యత్తు పునాది వేయడమే తమ పాఠశాల ఉద్దేశమని లిటిల్‌ఫ్లవర్ పాఠశాల ప్రిన్సిపల్ బ్రదర్ షాజాన్ ఆంథోని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే ప్రతి రంగంలో రాణించేందుకు ఉపాధ్యాయులు, యాజమాన్యం నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.



విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సర్వర్ డౌన్‌తో పరేషాన్

- గంటకు రెండే దరఖాస్తులు నమోదు
- 17లోగా పూర్తి చేయడానికి టార్గెట్ విధింపు
- ఆందోళనలో ఆపరేటర్లు


దరఖాస్తులను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్న ఆపరేటర్లు

నాంపల్లి: అభయహస్తం గ్యారంటీల దరఖాస్తులను కంప్యూటర్‌లో నమోదు చేసే ప్రక్రియకు సర్వర్ డౌన్ గండం పట్టుకుంది. రోజుకు ఒకో ఆపరేటర్ 80 దరఖాస్తులను నమోదు చేసేందుకు అధికారులు టార్గెట్ విధించారు. అలాగే ఒక్కో దరఖాస్తును కంప్యూటర్‌లో నమోదు చేయడానికి ఆపరేటర్‌కు రూ.15 ఇచ్చేందుకు ధరను నిర్ణయించారు. ఈ మేరకు అభయ హస్తం గ్యారంటీలను ఈనెల 17వ తేదీలోగా పూర్తి చేసేందుకు బల్దియా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగానే దరఖాస్తుల వివరాల నమోదు కార్యక్రమాన్ని ఓ ఏజెన్సీకి అప్పగించారు. ప్రైవేట్ ఆపరేటర్ల సహాయంతో అభయ హస్తం గ్యారంటీలకు అర్హులైన వారి జాబితాను సిద్ధం చేస్తున్నారు. నాంపల్లి నియోజకవర్గంలో 1,08,300 కుటుంబాలు ఉన్నాయి. ఈ కుటుంబాల నుంచి మొత్తం 87,399 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులను డిసెంబరు 28 నుంచి ఈనెల 6వ తేదీ వరకు స్వీకరించిన విషయం తెలిసిందే.

7 డివిజన్లలో మొత్తం 28 కేంద్రాల ఏర్పాటు..

నాంపల్లి నియోజకవర్గంలోని ఏడు డివిజన్లలో మొత్తం 28 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల నుంచి సేకరించిన దరఖాస్తులను ఖైరతాబాదులోని జోనల్ కార్యాలయంలో కంప్యూటరైజ్ చేస్తున్నారు. వందలాది మంది ప్రైవేట్ ఆపరేటర్లు వీటిని ఆన్‌లైన్ చేస్తున్నారు. అయితే సర్వర్ డౌన్ కారణంగా గంటకు రెండు దరఖాస్తులు కూడా సబ్‌మిట్ (నమోదు) చేసే అవకాశం లేకుండా పోయిందని ఆపరేటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తులోని అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి కంప్యూటర్‌లో స్థిరీకరణ చేయడానికి ఏడు నిమిషాల సమయం పడుతోందని తెలిపారు. సర్వర్ డౌన్ కారణంగా గంటలకు రెండే దరఖాస్తులను నమోదు చేయడానికి దరఖాస్తులు చేస్తున్నామని, సర్వర్ ఈ విధంగానే ఉంటే మాకు వీరిచ్చే డబ్బులు ఆర్టీసీ బస్సు ఛార్జీలకు కూడా సరిపోవని నిట్టూర్చుతున్నారు.

భాషా పరమైన సమస్యలు తలెత్తుతున్నాయి..

అదే విధంగా దరఖాస్తులు మూడు భాషల్లో ఉండటం మూలంగా చాలా మంది ఆపరేటర్లకు భాషా పరమైన సమస్యలు తలెత్తుతున్నాయని తెలుస్తోంది. ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సర్వర్ డౌన్ సమస్యను అధిగమించేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టారు. సర్వర్ డౌన్ సమస్య ఇలానే ఉంటే కంప్యూటర్ ఆపరేటర్లకు ఇచ్చిన టార్గెట్‌ను గడువులోగా పూర్తి చేయడం కష్టమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.


చంద్రశేఖర్, మెహిదీపట్నం సర్కిల్ ఇన్‌చార్జి డీసీ

సమస్య తలెత్తిన విషయం వాస్తవమే..

అభయహస్తం గ్యారంటీల దరఖాస్తులను కంప్యూటర్‌లో నమోదు చేసే ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. ఆపరేటర్ల సహాయంతో ఈ కార్యక్రమాన్ని జనవరి 17వ తేదీలోగా పూర్తి చేస్తాం. ఎలాంటి తప్పొప్పులు లేకుండా కంప్యూటర్‌లో వివరాలను నమోదు చేసే ప్రయత్నం చేస్తున్నాం. సర్వర్ డౌన్ ఉండటం చేత కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఈ అంతరాయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే ఈ సమస్యను అధిగమించి ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేస్తాం.

సందడిగా ముగ్గుల పోటీలు


ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న మన్మధు ముదిరాజ్, భారతి

జియాగూడ: కార్వాన్ డివిజన్‌లోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి పోటీలను నిర్వహించినట్లు ప్రోగ్రామ్ అధ్యక్షుడు సేనాపతి మన్మధు ముదిరాజ్, మహిళా అధ్యక్షురాలు భారతి తుపాకుల అన్నారు. సోమవారం ముదిరాజ్ మహిళలు సంక్రాంతి ముగ్గుల పోటీల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..నాలుగేళ్లుగా సంక్రాంతి ముగ్గుల పోటీలను ఉత్సాహంగా నిర్వహించి గెలిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నామన్నారు. అలాగే ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పండుగలు, క్రీడలు, సంక్షేమ కార్యక్రమాలు నిరవధికంగా నిర్వహిస్తున్నామన్నారు.

మిధాని డిపోలో వన భోజనాలు



సంతోష్‌నగర్: కంచన్‌బాగ్‌లోని మిధాని ఆర్టీసీ బస్ డిపోలో సోమవారం వన భోజనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. డిపో మేనేజర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైదరాబాద్ రీజినల్ మేనేజర్ వరప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చార్మినార్, హయత్‌నగర్ డీఆర్‌ఎంలు విజయ భాను, సుచరిత, ఆర్టీసీ అధికారులు, డ్రైవర్లు, కండక్టర్లు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

చార్మినార్: జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ పరిధిలోని చార్మినార్ సర్కిల్–9 డిప్యూటీ కమిషనర్‌గా ఎల్.సరిత సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ డీసీగా పని చేసిన డాకు నాయక్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో సరిత నూతన డీసీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలోని అధికారులు, సిబ్బంది ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. చార్మినార్ సర్కిల్ పరిధిలో ప్రజా పాలన కార్యక్రమం సందర్భంగా అందిన దరఖాస్తు ఫారాల ఎంట్రీని గడువులోగా పూర్తి చేయడం లక్ష్యంగా పని చేయనున్నట్లు తెలిపారు.

బహుమతుల ప్రదానం



చార్మినార్: విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసం వైపు దృష్టిసారిస్తే జీవితంలో ఆశించిన ఫలితాలు సాధిస్తారని ఇరాన్‌లోని అల్ ముస్తఫా అంతర్జాతీయ విశ్వవిద్యాలయం ప్రతినిధి రెజా శేకేరీ, ఇరాక్ కాన్సలేట్ జనరల్ భారత ప్రతినిధి ఓడే ఖుద్దేర్ అల్ అసదీ అన్నారు. యామ్ షియా టీవీ క్విజ్ పోటీలలో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం పాతబస్తీలో జరిగింది. ముఖ్యఅతిథులుగా హాజరైన వారు విజేతలకు బహుమతులను అందజేశారు. బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తదితరులు పాల్గొన్నారు.

ఖగోళ శాస్త్ర విజ్ఞాన ప్రదర్శనపై అవగాహన



అబిడ్స్: ఖగోళ శాస్త్రంపై విద్యార్థులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించారు. అబిడ్స్ డైమండ్ జూబ్లీ హైస్కూల్‌లో స్పేస్ వాక్ సింపాని వైజ్ఞానిక ప్రదర్శనలు ఘనంగా కొనసాగాయి. రెండవ రోజు నగరానికి చెందిన 20 పాఠశాలల విద్యార్థులు పాల్గొని విజ్ఞాన ప్రదర్శనను తిలకించారు. ప్రిన్సిపల్ సుజాత గాడే మాట్లాడుతూ.. తమ పాఠశాల విద్యార్థులు మారుతున్న సాంకేతిక విప్లవానికి అనుగుణంగా పలు వైజ్ఞానిక ప్రదర్శనలు చేశారన్నారు.

మూసి వేసిన బారికేడ్లను తొలగించిన ఎమ్మెల్యే



చార్మినార్: పంచమహల్లాలో సంబంధిత పోలీసులు మూడు రోజులుగా బారికేడ్లతో మూసి వేసిన రోడ్డు వివాదాస్పదంగా మారింది. విషయం తెలుసుకున్న చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జులీఫ్కర్ అలీ ఆదివారం రాత్రి పంచమహల్లాకు చేరుకొని సంబంధిత పోలీసులతో చర్చించారు. ఏకపక్ష నిర్ణయాలతో రోడ్డు మూసి వేయడంతో వాహనదారులు పలు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొంటూ తానే స్వయంగా బారికేడ్లను తొలగింప చేశారు.

తప్పిపోయిన బాలికను అప్పగింత



గౌలిపురా: తప్పిపోయిన బాలికను భవానీనగర్ పోలీసులు 3 గంటల్లోనే గుర్తించి సోమవారం కుటుంబసభ్యులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ ఎం.రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. జయమ్మ కూతురు స్వప్న (4) సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తప్పిపోయింది. తల్లి జయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఐదు బృందాలకు వీడిపోయిన బాలిక కోసం గాలింపు ప్రారంభించి 3 గంటల్లోనే గుర్తించారు. అనంతరం బాలికను కుటుంబసభ్యులకు అప్పగించారు. తమ బాలికను గుర్తించి అప్పగించినందుకు పోలీసులకు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

అదనపు కట్నానికి గృహిణి బలి

డబీర్‌పురా: అదనపు కట్నం వేధింపులతో ఓ గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చంచల్‌గూడ ప్రాంతానికి చెందిన రిజ్వాన్ అలీ ఖాన్‌కు శామీర్‌పేట్ దేవర్‌యంజాల్ ప్రాంతానికి చెందిన షేక్ ఫర్హాతో 2021లో వివాహం జరిగింది. వివాహం సమయంలో కట్నం రూ.2 లక్షలు, 5 తులాల బంగారం, ఇతర కానుకలను అందజేశారు. కొన్ని రోజులు వీరి కాపురం సజావుగా సాగింది. అనంతరం రిజ్వాన్ అలీ ఖాన్‌తో పాటు మామ బహదూర్ అలీఖాన్, మరదలు అదనపు కట్నం తీసుకురావాలంటూ షేక్ ఫర్హాను వేధింపులకు గురిచేయడం ప్రారంభించారు. వివాహం ద్వారా వచ్చే షాదీ ముబారక్ డబ్బులు సైతం తమకే ఇవ్వాలంటూ వేధించారు. గతేడాది ఆగస్టులో ఫర్హా కుటుంబ సభ్యులు టీవీఎస్ జూపేటర్ వాహనాన్ని సైతం ఇచ్చారు. అయినా ఫర్హాపై వేధింపులు ఆపకపోవడంతో సోమవారం చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది.

‘ప్రజావాణి’ని సద్వినియోగం చేసుకోవాలి

చాంద్రాయణగుట్ట: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టి. వెంకన్న సూచించారు. జోనల్ కమిషనర్ పర్యవేక్షణలో సోమవారం చాంద్రాయణగుట్టలోని జోనల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో 10 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ..ప్రజావాణిలో జోనల్ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆస్తిపన్ను, రోడ్లు, రోడ్డు విస్తరణ, వీధి దీపాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయన్నారు. అందిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ విభాగం సిటీ ప్లానర్ శ్యామ్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ) డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ (యూబీడీ) అమీనా బీ, సంతోష్‌నగర్ డీసీ నాగమణి, ఏఎంసీ రాజారావు, యూసీడీ డీపీఓ రత్నమ్మ పాల్గొన్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ వెంకన్న

‘ప్రజావాణి’తో సమస్యల పరిష్కారం


ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ బాలయ్య ఇతర అధికారులు

అబిడ్స్: ప్రజావాణితో ప్రజల సమస్యలు వేగవంతంగా పరిష్కారం అవుతాయని అబిడ్స్–14వ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ బాలయ్య పేర్కొన్నారు. సోమవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ..ఎప్పటికప్పుడు ప్రజావాణి సమస్యలు సంబంధిత శాఖల అధికారులు పరిష్కారం చేస్తారన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజావాణి సర్కిల్ కార్యాలయంలో కొనసాగుతుందన్నారు. ప్రజలు ఎవరైనా నేరుగా విచ్చేసి సమస్యలు వివరించవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ సయ్యద్ సైదుద్దీన్, డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, ఈఈ ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముక్తాబాయి సాళ్వే మాంగ్ జయంతి

గన్‌ఫౌండ్రీ: నేటి యువత మహిళా రచయిత్రి ముక్తాబాయి సాళ్వే మాంగ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ అన్నారు. కేవలం మూడేళ్లుగా పాఠశాల విద్యాభ్యాసంతో 14 ఏళ్ల వయస్సులోనే వివక్ష, అణచివేతలాంటి విస్తృత భావనలను అర్థం చేసుకుని పోరాడిన గొప్ప మహిళ అని కొనియాడారు. సోమవారం రవీంద్రభారతిలో మాంగ్ సమాజ్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో ముక్తాబాయి 183వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాంగ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు గైక్వాడ్ తులసిదాస్ మాంగ్, ప్రముఖ దళిత ఉద్యమకారులు జేబీ రాజు, ఓయూ ప్రొఫెసర్ మాయాదేవి, మాసారం ప్రేమ్‌కుమార్, వివిధ జిల్లాలకు చెందిన అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న మామిడి హరికృష్ణ తదితరులు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



గోల్కొండ: శరీరం దృఢంగా ఉండాలంటే ఎముకలు ముఖ్యమని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సాధన్ పాలకూరి అన్నారు. సోమవారం షేక్‌పేట్ ఓయూ కాలనీలోని పీవీజీ హాస్పటల్స్‌లో ఉచిత ఆర్థోపెడిక్ పెయిన్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ట్రస్ట్ తరఫున ప్రతి నెలా ఒకటి చొప్పున ఉచిత ఆర్థోపెడిక్ క్యాంప్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో మోకాళ్ల నొప్పి, వెన్ను నొప్పి, మెడ, షోల్డర్ పెయిన్, మస్కులర్ పెయిన్ తదితర వాటిపై ఉచిత పరీక్షలు నిర్వహించి అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తూ ఎందరికో ఇప్పటి వరకు సేవ చేశామని ఆయన అన్నారు. షేక్‌పేట్, మణికొండ, టోలిచౌకి తదితర ప్రాంతాల వారికి ఇప్పటి వరకు ఉచిత వైద్య శిబిరంలో వైద్య సేవలు అందించామని ఆయన పేర్కొన్నారు.

రమణీయం.. రుక్మిణి కల్యాణం



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్యగురువు దివంగతి పద్మ భూషణ్ డాక్టర్ వెంపటి చిన సత్యం ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని హెచ్‌సీయూ ప్రొఫెసర్ డాక్టర్ తడకమళ్ల అనురాధ అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో అభినయవాణి నృత్య నికేతన్ ఆధ్వర్యంలో పద్మభూషణ్ వెంపటి చినసత్యం జ్ఞాపకార్థం రెండురోజుల పాటు వెంపటి నాట్య మేధా పేరిట నిర్వహిస్తున్న కళా ఉత్సవం ఘనంగా ప్రారంభమైంది. సంస్థ వ్యవస్థాపకురాలు, నృత్య గురువు బాలాత్రిపుర సుందరి ఆధ్వర్యంలో రుక్మిణి కల్యాణం పేరిట నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. రెండు దశాబ్దాలుగా కూచిపూడి స్ఫూర్తిని పరిరక్షించాలనే తపనతో అలుపెరుగని శిక్షణ ఇస్తున్న నృత్య గురువులను పలువురు వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎస్ బీసీ ఎండీ మమత, రుక్మిణి కళ్యాణం రచయిత భుజనాగరాయ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



చార్మినార్: మజ్లిస్ పార్టీ హైదరాబాద్ జిల్లా ఓబీసీ విభాగం అధ్యక్షుడిగా ఆర్.దీపేష్ రాజ్ వర్మ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తనను ఓబీసీ జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. దూద్‌బౌలీకి చెందిన తాను కొంత కాలంగా పార్టీకి నిరంతరం సేవలు కొనసాగిస్తున్నానన్నారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నానని, పాతబస్తీలోని ప్రజల సమస్యలను తెలుసుకుని ఆయా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు అండగా మజ్లిస్ పార్టీ

గోల్కొండ: విద్యార్థులకు మజ్లిస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన సాలర్ ఏ మిల్లత్ ట్రస్ట్ తరఫున 10వ తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్స్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ మోడల్ పేపర్స్ ద్వారా పదవ తరగతిలో విద్యార్థులు మంచి జీపీఏ సాధిస్తున్నారన్నారు. అంతేకాకుండా మంచి కళాశాలల్లో ప్రవేశాలు పొందుతున్నారని అన్నారు. సాలర్ ఏ మిల్లత్ ఫౌండేషన్ తరఫున నగరంలో పాఠశాలలతో పాటు కళాశాలలు కూడా విజయవంతంగా నడుస్తున్నాయని ఆయన అన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రతియేటా విద్యార్థుల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నారని వేలాది మంది పేద విద్యార్థులకు దీని ద్వారా లబ్ధి చేకూరడం జరిగిందన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు ఆలీముద్దీన్, హారూన్‌ఫరాన్ పాల్గొన్నారు.


విద్యార్థులకు మోడల్ పేపర్స్ అందిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

యాకుత్‌పురాలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ పర్యటన

యాకుత్‌పురా: జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ సోమవారం యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్‌తో కలిసి యాకుత్‌పురా నియోజకవర్గంలో పర్యటించారు. ఉదయం యాకుత్‌పురాకు చేరుకున్న ఆయన ఎమ్మెల్యేతో పాటు కార్పొరేటర్లు, చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్నతో కలిసి అజ్మత్‌నగర్, చోటా నాలా, ఈస్ట్ చంద్రానగర్, రైల్వే స్టేషన్, రెయిన్‌బజార్, మౌల్లా కాచీల్లా, ఎస్ఆర్టీ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. యాకుత్‌పురా నాలా పరిసర ప్రాంతాల్లో కొనసాగున్న నాలా విస్తరణ, అభివృద్ధి నిర్మాణ పనులను పరిశీలించి వాటి పురగతిపై సంబంధిత అధికారులతో ఆరా తీశారు. పలు బస్తీల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. యాకుత్‌పురాలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. ఈ పర్యటనలో తలాబ్‌చంచలం, రెయిన్‌బజార్, డబీర్‌పురా, సంతోష్‌నగర్ డివిజన్ల కార్పొరేటర్లు డాక్టర్ సమీనా బేగం, మహ్మద్ వసీవుద్దీన్, అలాందార్ వాలాజహి, ముజఫర్ హుస్సేన్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగల అరెస్టు

దూద్‌బౌలి: ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తూ తప్పించుకుని తిరుగుతున్న ఐదుగురు నిందితులను హుస్సేనీ ఆలం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చార్మినార్ ఏసీపీ రుద్రభాస్కర్ తెలిపారు. సోమవారం చార్మినార్ ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యాకుత్‌పురా రంగేలీ కిడికీ ప్రాంతానికి చెందిన అబ్బాస్ అలీ(21), బడాబజార్‌కు చెందిన అలీ హుస్సేన్ అలియాస్ అలీ(21), అమన్‌నగర్‌కు చెందిన వాహబ ఖాన్(33), బడాబజార్‌కు చెందిన మహ్మద్ గౌస్ పాషా(22), కంచన్‌బాగ్‌కు చెందిన ఆజం ఖాన్(22) తదితరులు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను దొంగిలించి తప్పించుకుతిరుగుతున్నారు. ఈ నెల 4న ఘాన్సీబజార్‌లోని కోకర్ వాడికి చెందిన శంబునాథ్ రాయ్‌కు చెందిన యమహా ద్విచక్ర వాహనాన్ని నిందితులు తన ఇంటి ముందు పార్క్ చేయగా.. తస్కరించి పారిపోయారు. ఈ విషయాన్ని బాధితుడు ఈనెల 5న హుస్సేనీఆలం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగించి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

మస్కత్‌లో ఉన్న నగర మహిళకు ఏజెంట్ బెదిరింపులు

గోల్కొండ: అరబ్ దేశం మస్కత్‌లో ఏజెంట్ ద్వారా మోసపోయిన ఓ హైదరాబాద్ మహిళ కుటుంబ సభ్యులకు ఏజెంట్ భయాభ్రాంతులకు గురి చేస్తోంది. ఇంటి పనిమనిషిగా మంచి జీతంతో పాటు ఉచిత వసతి, భోజనం కల్పిస్తానంటూ షేనాజ్‌బేగం అనే మహిళా ఏజెంట్, టోలిచౌకీ జమాలికుంటకు చెందిన ఫరీదాబేగంకు ఆశ చూపింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఫరీదా ఏజెంట్ మాటలు నమ్మి గత నవంబర్ నెల 4న మస్కత్‌లో ఓ అరబ్ షేక్ ఇంట్లో పనికి చేరింది. అక్కడ పని ఒత్తిడితో ఆమె అనారోగ్యానికి గురై కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. హైదరాబాద్‌లోని తన కుటుంబ సభ్యులకు ఆమె తన ఆరోగ్యం బాగా దెబ్బ తినిందని తిరిగి హైదరాబాద్ వచ్చేస్తానంటూ వాట్సాప్ ద్వారా సందేశం పంపింది. దీనిపై ఆమె చెల్లెలు ఫహమీదాబేగం దుబాయ్‌లో ఉండే మహిళా ఏజెంట్ షేనాజ్‌బేగంను సంప్రదించి తన సోదరి పని చేసే స్థితిలో లేదని ఆమె పాస్‌పోర్టు ఇచ్చేసి స్వదేశానికి పంపాలని కోరింది. అయితే తనకు రెండున్నర లక్షలు చెల్లిస్తే ఆమెను ఇండియాకు పంపుతానని షేనాజ్‌బేగం తెలిపింది. దీంతో టోలిచౌకీలోని ఫహమీదాబేగం తన సోదరిని మస్కత్ నుంచి ఇండియా పంపించాలని కోరుతూ భారత విదేశాంగ మంత్రికి ఉత్తరం రాసింది. ఈ విషయం తెలిసిన మహిళా ఏజెంట్ షేనాజ్‌బేగం తాను ఎవరికి భయపడనంటూ బాధిత మహిళ కుటుంబ సభ్యులను ఫోన్‌లలో బెదిరించింది. అయితే.. దీనిపై మరింత ముందుకెళ్లడానికి బాధిత కుటుంబ సభ్యులు వెనుకాడుతున్నారు.

ఇంటింటికీ రాములోరి అక్షింతలు


గుడిమల్కాపూర్ వీధుల్లో అక్షింతల ఊరేగింపు

గోల్కొండ: ప్రతి ఇంటా శ్రీరాముల వారి అక్షింతలు ఉండాలని బీజేపీ సీనియర్ నాయకులు దేవర శ్రీనివాస్, దేవర వంశీ అన్నారు. సోమవారం గుడిమల్కాపూర్ వీధుల్లో వైభవంగా శ్రీరాముల వారి అక్షింతల ఊరేగింపు, పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీరామ భక్తులు ఇంటింటికీ తిరిగి అక్షింతలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 22న ప్రతి ఇంటిని దీపాలతో అలంకరించాలన్నారు. హరిదాస్‌నగర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఊరేగింపునకు ప్రతి ఒక్కరూ స్వాగతం పలికారు. నాయకులు అశ్విన్‌మోదీ, వేణుగోపాల్‌సాగర్, శివరాజ్, సృజన్, సాయిరామ్‌సాగర్ తదితరులున్నారు.

శ్రీరాముని అక్షింతలు ఎంతో శుభకరం..

సుల్తాన్‌బజార్: అయోధ్య శ్రీరాముని అక్షింతలు రావడం ఎంతో శుభమని జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ అన్నారు. సోమవారం అయోధ్య శ్రీరాముని అక్షింతలను జాంబాగ్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆయన పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ..శ్రీరాముని అక్షింతల వల్ల కుటుంబంలో సుఖఃశాంతులు లభిస్తాయన్నారు. నాయకులు మయూర్, రఘు, ముఖేష్, రామకృష్ణ, సందీప్‌జైన్ పాల్గొన్నారు.

ఇంటింటికీ అక్షింతల పంపిణీ..

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని నిరాకర భక్త సమాజం, గౌలిపురా ప్రధాన రోడ్డు, మిత్రా క్లబ్ తదితర ప్రాంతాల్లో సోమవారం అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ఆధ్వర్యంలో శ్రీరాముని అక్షింతలు ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బస్తీ ప్రముఖ రామన్‌రాజ్ బర్మ, విశాల్, ప్రవీణ్, రోహిత్, నిఖిల్ పాల్గొన్నారు.


గౌలిపురా డివిజన్‌లో..

22న ఇంటింటా దీపావళి..

చార్మినార్: ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ జరుగుతున్న సందర్భంగా అందరూ తమ తమ ఇళ్లల్లో ఆరోజు ప్రత్యేక పూజలు నిర్వహించి దీపావళి పండుగ లాగా దీపాలంకరణ చేయాలని వీహెచ్‌పీ కేంద్రీయ సంయుక్త కార్యదర్శి సత్యం జీ, రామ జన్మ భూమి తీర్థ ట్రస్ట్ చార్మినార్ భాగ్ కన్వీనర్ విశాల్ ప్రసాద్ కోరారు. రామ మందిర తీర్థ ట్రస్ట్ నుంచి వచ్చిన అక్షింతలను మీరాలం మండి శ్రీ మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్యతో పాటు బేలా ముత్యాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు పాటిల్ సదానంద్ యాదవ్‌కు సోమవారం అందజేశారు. అల్లం భాను మూర్తి తదితరులు పాల్గొన్నారు.


అక్షింతలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ తదితరులు


గాజుల అంజయ్యకు అక్షింతలు అందజేస్తున్న ప్రతినిధులు